# ప్రజా మంటలు

## తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు








ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 350 పేజిలు : 04 వెల రూ. 2 ఆదివారం 02 - 08 - 2026


## వాట్సాప్ అంకుల్స్‌పై ఇన్‌స్టా పిల్లలు గెలిచారు



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్ జీ ఓటర్లు
- సోషల్ మీడియా వల్లే జవాబుదారీతనం పెరిగిందన్న కేటీఆర్
- నేటి యువతరం రీల్స్ రూపంలో వార్తలు చూస్తోందని వ్యాఖ్య

**హైదరాబాద్ :** వచ్చే ఎన్నికల్లో 50 శాతానికి పైగా జెన్-జీ తరం ఓటర్లే కీలక పాత్ర పోషించబోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇటీవల నీట్ పరీక్ష వైఫల్యంపై జరిగిన - మిగతా 2 లో

# అసెంబ్లీలో వ్యక్తిగత దూషణలకు చెక్

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- రెచ్చగొట్టే ప్రసంగాలు, నేరాలను అరికట్టేలా చట్టాన్ని రూపొందించిన ప్రభుత్వం
- అసెంబ్లీలో వ్యక్తిగత దూషణలకు చెక్ పెట్టడమే ప్రభుత్వ లక్ష్యమన్న పొన్నం ప్రభాకర్
- బిల్లును మరింత సమగ్రంగా, రాజ్యాంగబద్ధంగా రూపొందించే లక్ష్యంతో ఏర్పాటైన సెలెక్ట్ కమిటీ సమావేశం
- వారం రోజుల్లో మరోసారి భేటీ కానున్న కమిటీ
- అన్ని పార్టీల సలహాలు తీసుకుంటామన్న మంత్రి




**హైదరాబాద్ :** కులం, మతం, ప్రాంతం, లింగం పేరుతో విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు, నేరాలను అరికట్టేలా చట్టాన్ని రూపొందించడంపై కమిటీ దృష్టి సారించినట్లు విద్వేషపూరిత నేరాల కమిటీ అధ్యక్షుడు, మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ శాసనసభలో తొలిసారిగా ప్రతిపాదించిన 2026 తెలంగాణ విద్వేషపూరిత నేరాల - హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ బిల్లుపై కీలక ప్రక్రియ ప్రారంభమైంది. బిల్లును మరింత సమగ్రంగా, రాజ్యాంగబద్ధంగా రూపొందించే లక్ష్యంతో ఏర్పాటైన సెలెక్ట్ కమిటీ సమావేశం స్పీకర్ ఛాంబర్‌లో జరిగింది.సమతుల్యత పాటించాలని కమిటీ స్పష్టం : అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు సెలెక్ట్ కమిటీ నివేదికను సభకు సమర్పించాలనే లక్ష్యంతో కార్యాచరణ రూపొందించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్? తెలిపారు. బిల్లుపై శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల - మిగతా 2 లో

## తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్




- దరఖాస్తుల తేదీలు ఖరారు
- తెలంగాణలో 7,437 పోలీస్ పోస్టుల భర్తీకి ప్రకటన
- ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు
- పోలీస్, ఎస్పీఎఫ్, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో ఖాళీల భర్తీ
- నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేసిన టీఎస్ఎల్‌పీఆర్‌బీ

## అజిత్ దోవల్‌కు లోక్ మాన్య తిలక్ జాతీయ పురస్కారం


- అమిత్ షా చేతుల మీదుగా ప్రధానం
- పుణేలో తిలక్ 106వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారం అందజేత
- కార్యక్రమంలో పాల్గొన్న ఫడ్నవిస్, ఏక్ నాథ్ షిండే, సునేత్ర పవార్
- జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో పాటు రూ. 1 లక్ష నగదు బహుమతి




**ఢిల్లీ :** దేశ భద్రత, కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్లలో తిరుగులేని సేవలు అందించిన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను 'లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డు' వరించింది. మహారాష్ట్రలోని పుణేలో ఈరోజు బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అజిత్ దోవల్‌కు అందజేశారు. ఈ వేడుకలో లోక్‌మాన్య తిలక్ స్మారక్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ రోహిత్ తిలక్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలు ఏక్ నాథ్ షిండే, సునేత్ర పవార్‌లతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అవార్డు కింద ఒక జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో పాటు రూ. 1 లక్ష నగదు బహుమతిని అందజేశారు.దేశ భద్రత, దౌత్యం, ఇంటెలిజెన్స్ రంగాలలో సుదీర్ఘ అనుభవం - మిగతా 2 లో

## చంద్రుడిని ఢీకొట్టనున్న స్పేస్‌ఎక్స్ రాకెట్

- శాస్త్రవేత్తల్లో ఉత్కంఠ
- చంద్రుడివైపు దూసుకెళ్తున్న స్పేస్‌ఎక్స్ రాకెట్ పైదశ
- గంటకు 8,700 కి.మీ. వేగంతో ఢీకొట్టే అవకాశం
- కొత్త గుంత, ధూళి మేఘం ఏర్పడతాయని అంచనా
- అంతరిక్ష వ్యర్థాల ప్రమాదంపై మరో హెచ్చరిక




**ఢిల్లీ :** అంతరిక్షంలో ప్రయోగాల సంఖ్య పెరుగుతున్న కొద్దీ వ్యర్థాల సమస్య కూడా తీవ్రమవుతోంది. తాజాగా స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఓ రాకెట్ పైదశ నియంత్రణ కోల్పోయి చంద్రుడిని ఢీకొట్టే దిశగా - మిగతా 2 లో

## పీవోకేలో పాక్ దమనకాండ నాలుగు రోజుల్లో 50 మందికిపైగా మృతి

- పీవోకేలో నాలుగు రోజులుగా ఉద్రిక్త పరిస్థితులు
- భద్రతా బలగాల చర్యల్లో 50 మందికిపైగా మృతి
- హెచ్ఆర్ఎఫ్ తీవ్ర ఖండన
- ఇంటర్నెట్, మీడియాపై ఆంక్షలు
- ఐరాసను ఆశ్రయించిన యూకేపీఎన్‌పీ ప్రతినిధులు



**ఢిల్లీ :** పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న నిరసనలపై పాకిస్థాన్ భద్రతా బలగాలు కఠినంగా వ్యవహరించడంతో 50 మందికిపైగా మరణించారు. వందలాది మంది గాయపడినట్లు స్థానిక సంస్థలు - మిగతా 2 లో

## సముద్రపు దొంగల చెరలో 16 మంది భారత నావికులు

- ఏప్రిల్ నుంచి జులై మధ్య మూడు నౌకల హైజాక్
- అధికారికంగా ధ్రువీకరించిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మారిటైమ్ అడ్మినిస్ట్రేషన్
- సిబ్బంది అప్రమత్తతతో తప్పిన మరో నౌక హైజాక్
- హై-రిస్క్ ఏరియాలో నౌకలకు కీలక భద్రతా సూచనలు జారీ



**ఢిల్లీ :** సోమాలియా సముద్ర తీర ప్రాంతాల్లో సముద్రపు దొంగల ఆగడాలు మరోసారి పెరిగాయి. ఏడెన్ గల్ఫ్, ఆఫ్రికా తీర ప్రాంత జలాల్లో పైరేట్లు జరిపిన వేర్వేరు హైజాక్‌లలో మొత్తం 16 మంది భారత నావికులు బందీలుగా చిక్కుకున్నారని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మారిటైమ్ అడ్మినిస్ట్రేషన్ (డీజీఎంఏ) అధికారికంగా ధ్రువీకరించింది.ఈ ఏడాది ఏప్రిల్ 24 నుంచి జులై 17 మధ్య కాలంలో ఈ నౌకలను హైజాక్ చేశారు. చివరగా జులై 17న ఏడెన్ గల్ఫ్‌లో ఎంటీ అసానా అనే నౌకను హైజాక్ చేశారు. అందులోని 22 మంది సిబ్బందిలో 11 మంది భారతీయులు ఉన్నారు. ఈ నౌక ప్రస్తుతం సోమాలియా వైపు ప్రయాణిస్తున్నట్లు సమాచారం. అంతకుముందు, మే 2న ఎంటీ యూరేకా, ఏప్రిల్ 24న ఎంటీ హానర్ నౌకలను కూడా పైరేట్లు అపహరించారు. ఈ రెండు నౌకల్లో కలిపి ఐదుగురు భారతీయులు ఉన్నారు.అయితే, సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించడం వల్ల ఒక నౌక హైజాక్ - మిగతా 2 లో




## భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు మణిహారం




- సరికొత్త చరిత్రకు నాంది పలికాం: సీఎం చంద్రబాబు
- ఉత్తరాంధ్రలో సరికొత్త చరిత్ర ప్రారంభమైందన్న సీఎం చంద్రబాబు
- భోగాపురం ఎయిర్‌పోర్టును ఉత్తరాంధ్రకు మణిహారంగా అభివర్ణన
- భూములిచ్చిన రైతులకు పాదాభివందనం చేస్తున్నట్లు వెల్లడి
- అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారన్న సీఎం
- రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామన్న మాట నిలబెట్టుకుంటున్నామని స్పష్టీకరణ

# భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ

- బొబ్బిలి వీణతో చంద్రబాబు సత్కారం
- భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ
- ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- ప్రధాని మోదీకి బొబ్బిలి వీణను బహూకరించిన ముఖ్యమంత్రి
- గిన్నిస్ రికార్డ్ సాధించిన థింసా నృత్యాన్ని వీక్షించిన ప్రధాని
- ఎయిర్‌పోర్ట్‌లోని ఆధునిక సదుపాయాలను పరిశీలించిన మోదీ



**అమరావతి :** ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకమైన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానితో పాటు గవర్నర్ జస్టిస్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, అశోక్‌గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.ప్రారంభోత్సవం అనంతరం ప్రధాని మోదీ టెర్మినల్ భవనంలో కలియదిరిగి ఆధునిక సదుపాయాలను పరిశీలించారు. విమానాశ్రయం ప్రత్యేకతలు, నిర్మాణ విశేషాలను జీఎంఆర్ గ్రూపు ఛైర్మన్ జి.మల్లిఖార్జునరావు, బిజినెస్ ఛైర్మన్ జీబీఎస్ రాజు ప్రధానికి వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. ప్రధాని మోదీకి ఉత్తరాంధ్ర కళావైభవానికి ప్రతీకగా నిలిచే బొబ్బిలి వీణను బహూకరించి సత్కరించారు. అంతకుముందు సభా ప్రాంగణానికి ఓపెన్ టాప్ జీపులో వస్తూ మార్గమధ్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రధాని మోదీ వీక్షించారు. ఇటీవలే గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన థింసా నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేలాది మంది - మిగతా 2 లో

# సంపాదకీయం

## ప్రకృతి సంరక్షణతోనే పర్యాటకాభివృద్ధి

(హెచ్.ప్రతాప్)

ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించే పర్యాటక విధానమే పర్యావరణ పర్యాటకం (ఎకో టూరిజం). ఇది కేవలం విహారయాత్రలకు పరిమితమైన భావన కాదు; ప్రకృతి సంరక్షణ, గ్రామీణాభివృద్ధి, స్థానిక ఉపాధి, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, సుస్థిర ఆర్థికాభివృద్ధిని సమన్వయం చేసే సమగ్ర నమూనా. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో ఎకో టూరిజం వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగంగా అవతరించింది. ప్రకృతి సంపద, జీవవైవిధ్యం, భౌగోళిక వైవిధ్యం సమృద్ధిగా ఉన్న భారతదేశానికి ఈ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయి.భారతదేశంలో ఎకో టూరిజం అభివృద్ధి ఇప్పుడు అవసరం మాత్రమే కాదు, అత్యవసరం కూడా. ప్రకృతి సంపదను కాపాడుకుంటూనే ఉపాధిని సృష్టించగల అరుదైన రంగాల్లో ఇది ఒకటి. దేశానికి 7,500 కిలోమీటర్లకు పైగా తీరరేఖ, విశాలమైన హిమాలయ పర్వత ప్రాంతాలు, 100కు పైగా జాతీయ ఉద్యానవనాలు, 570కు పైగా వన్యప్రాణి అభయారణ్యాలు, 50కు పైగా పులుల సంరక్షణ కేంద్రాలు, పశ్చిమ కనుమలు, ఈశాన్య భారత అటవీ ప్రాంతాలు, సుందర్‌బన్స్ మడ అడవులు, అండమాన్--నికోబార్, లక్షద్వీప్ వంటి అరుదైన ప్రకృతి వనరులు ఉన్నాయి. ఇవి కేవలం సహజ అందాలే కాదు; ప్రపంచ స్థాయి పర్యావరణ పర్యాటకానికి బలమైన ఆర్థిక పునాదులు.పర్యాటక రంగం దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోంది. 2019--20లో భారత స్థూల దేశీయోత్పత్తికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5.19 శాతం వాటా ఈ రంగం అందించింది. 2021లో పర్యాటక రంగం 7.99 కోట్ల (79.86 మిలియన్) ఉద్యోగాలకు ఆధారంగా నిలిచింది. ఇన్వెస్ట్ ఇండియా అంచనా ప్రకారం 2030 నాటికి భారత పర్యాటక రంగం 250 బిలియన్ అమెరికన్ డాలర్ల జీడీపీ, 56 బిలియన్ డాలర్ల విదేశీ మారక ఆదాయం, 13.7 కోట్ల (137 మిలియన్) ఉద్యోగాలను సృష్టించే సామర్థ్యం కలిగి ఉంది. ఈ వృద్ధిలో ఎకో టూరిజం ప్రధాన పాత్ర పోషించే అవకాశం ఉంది.కేంద్ర ప్రభుత్వం కూడా ఈ రంగానికి ప్రాధాన్యం ఇస్తోంది. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ రంగానికి ప్రాధాన్యం ఇస్తోంది. నేషనల్ స్ట్రాటజీ ఫర్ ఎకో టూరిజం, స్వదేశ్ దర్శన్ 2.0, ట్రావెల్ ఫర్ లైఫ్ , బెస్ట్ టూరిజం విలేజ్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రకృతి ఆధారిత పర్యాటకాన్ని ప్రోత్సహిస్తోంది. గ్రామీణ హోమ్‌స్టేలు, స్థానిక గైడ్ సేవలు, హస్తకళలు, గిరిజన సంస్కృతి, సంప్రదాయ ఆహారాలు, ప్రకృతి విహారాలు, పక్షుల వీక్షణ, అడవి సఫారీలు వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతోంది.వంటి కార్యక్రమాల ద్వారా ప్రకృతి ఆధారిత పర్యాటకాన్ని ప్రోత్సహిస్తోంది. గ్రామీణ హోమ్‌స్టేలు, స్థానిక గైడ్ సేవలు, హస్తకళలు, గిరిజన సంస్కృతి, సంప్రదాయ ఆహారాలు, ప్రకృతి నడకలు, పక్షుల వీక్షణ, అడవి సఫారీలు వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త అవకాశాలు కల్పిస్తోంది. స్థానిక ప్రజలే ఈ అభివృద్ధిలో భాగస్వాములైతే ఆదాయం పెరగడంతో పాటు ప్రకృతి సంరక్షణపై బాధ్యత కూడా పెరుగుతుంది.ఎకో టూరిజం ద్వారా గ్రామీణ యువతకు గైడ్‌లు, హోమ్‌స్టే నిర్వాహకులు, రవాణా సేవలు, సాహస క్రీడల శిక్షకులు, హస్తకళల విక్రేతలు, స్థానిక ఆహార వ్యాపారులుగా ఉపాధి లభిస్తుంది. మహిళా స్వయం సహాయక సంఘాలకు కూడా ఇది ఆదాయ వనరుగా మారుతుంది. గ్రామీణ వలసలు తగ్గడంతో పాటు స్థానిక సంస్కృతి, సంప్రదాయ కళలు, జీవన విధానానికి కొత్త గుర్తింపు లభిస్తుంది.అయితే అభివృద్ధి పేరుతో ప్రకృతిని ధ్వంసం చేయకూడదు. ఎకో టూరిజం విజయవంతం కావాలంటే క్యారీయింగ్ కెపాసిటీ సూత్రాన్ని తప్పనిసరిగా పాటించాలి. పర్యాటకుల సంఖ్యను నియంత్రించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించడం, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, నీటి వనరుల సంరక్షణ, అడవులపై ఒత్తిడిని తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వినియోగం వంటి చర్యలు అమలు చేయాలి. పర్యాటకాభివృద్ధిలో స్థానిక సముదాయాలను భాగస్వాములను చేసి, ఆదాయంలో వారికి తగిన వాటా కల్పించినప్పుడే ఈ రంగం నిజమైన సుస్థిర అభివృద్ధికి దోహదపడుతుంది.ప్రకృతిని దోచుకోవడం కాదు, సంరక్షిస్తూ అభివృద్ధి సాధించడమే ఎకో టూరిజం లక్ష్యం. గ్రామాలకు ఉపాధి, రాష్ట్రాలకు ఆదాయం, దేశానికి విదేశీ మారకద్రవ్యం, పర్యావరణానికి రక్షణ---ఈ నాలుగు ప్రయోజనాలను ఒకేసారి అందించే సామర్థ్యం ఈ రంగానికి ఉంది. సరైన విధానాలు, సమర్థవంతమైన నిర్వహణ, స్థానిక ప్రజల భాగస్వామ్యం, పర్యావరణ సమతుల్యతకు ప్రాధాన్యం కల్పిస్తే సంరక్షణతో కూడిన అభివృద్ధికి భారతదేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలవగలదు.

# భోగాపురం ఎయిర్‌పోర్టును జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ

**మొదటిపేజీ తరువాయి -** యువతులు ప్రదర్శించిన ఈ నృత్యాన్ని చూసి ప్రధాని ఆసక్తి కనబరిచారు. ఈ క్రమంలో ఆయన ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

# భోగాపురం ఎయిర్ పోర్టు క్రెడిట్ వార్

**మొదటిపేజీ తరువాయి -** తెలిపింది. ఈ ప్రాజెక్టుకు పునాది వేసి, కల నుంచి నిజం దిశగా నడిపించిన నాయకుడు ఎవరో రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా తెలుసని పేర్కొంది. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి నాయకులు ఎలాంటి పాత్ర లేకుండానే మొత్తం క్రెడిట్ వారి ఖాతాలో వేసుకునేందుకు తాపత్రయపడుతున్నారని తీవ్రంగా ఆరోపించింది.జగన్ ప్రభుత్వం ఉన్న సమయంలోనే ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం రూ.1,200 కోట్లు ఖర్చు చేసి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేశామని తెలిపింది. నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లించడంలో తమ ప్రభుత్వమే ముందడుగు వేసిందని స్పష్టం చేసింది. ప్రాజెక్టుకు అవసరమైన అన్ని రకాల కీలక పర్యావరణ, విమానయాన అనుమతులను జగన్ హయాంలోనే వేగవంతంగా సాధించామని తెలిపింది. ఎయిర్‌పోర్టు అనుసంధానతకు అవసరమైన రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు నాటి జగన్ ప్రభుత్వమే శ్రీకారం చుట్టిందని, అందువల్ల ఈ ప్రాజెక్టు విజయంలో చంద్రబాబు పాత్ర ఏమీ లేదని విమర్శించింది.

# సముద్రపు దొంగల చెరలో 16 మంది భారత నావికులు

**మొదటిపేజీ తరువాయి -** నుంచి సురక్షితంగా బయటపడింది. జులై 1న ఎంవీ గోల్డెన్ ఆర్సెనల్ నౌకపై పైరేట్లు దాడికి యత్నించగా, సిబ్బంది వెంటనే షిప్ సెక్యూరిటీ ప్లాన్‌ను అమలు చేసి, 'సిటాడెల్' అనే సురక్షిత గదిలోకి వెళ్లిపోయారు. అక్కడి నుంచి ఇండియన్ నేవీకి సమాచారం అందించడంతో, వెంటనే రంగంలోకి దిగిన నౌకాదళం హెలికాప్టర్‌ను పంపింది. నేవీ రాకను గమనించిన దొంగలు పరారయ్యారు.ఈ వరుస ఘటనల నేపథ్యంలో ఏడెన్ గల్ఫ్, పరిసర ప్రాంతాల్లో సముద్ర ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారిందని డీజీఎంఏ హెచ్చరించింది. నౌకలు ప్రయాణానికి ముందు తప్పనిసరిగా భద్రతాపరమైన రిస్క్ అంచనా వేసుకోవాలని, 'బెస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాక్టీసెస్' మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించింది. దాడి జరిగినప్పుడు సిబ్బంది వెంటనే సిటాడెల్‌లోకి వెళ్లి సాయం కోసం సమాచారం అందించాలని స్పష్టం చేసింది. హై-రిస్క్ ఏరియాలో ప్రయాణించే నౌకల యజమానులు, మాస్టర్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని గట్టిగా సూచించింది.

# అజిత్ దోవల్‌కు లోక్‌మాన్య తిలక్ జాతీయ పురస్కారం

**మొదటిపేజీ తరువాయి -** ఉన్న అజిత్ దోవల్ (81) భారత రక్షణ వ్యవస్థలో కీలక పాత్ర పోషించారు. 'ఆపరేషన్ బ్లాక్ థండర్', డోక్లామ్ వివాదంలో వ్యూహాత్మక దౌత్య చర్చలు, బాలాకోట్ వైమానిక దాడుల రూపకల్పనలో ఆయన పాత్ర అత్యంత ప్రశంసనీయం. 1968 కేరళ కేడర్‌కు చెందిన ఈ మాజీ ఐపీఎస్ అధికారి, మూడు దశాబ్దాలకు పైగా భారత ఇంటెలిజెన్స్‌లో పనిచేసి, ఆ తర్వాత ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్‌గా సేవలు అందించారు. మిజోరం, సిక్కిం, పంజాబ్, జమ్మూకశ్మీర్ వంటి తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలతో పాటు ఇస్లామాబాద్, లండన్‌లలో భారత దౌత్య కార్యాలయాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. తమ రంగాల్లో సేవలు అందిస్తూ భారత్‌ను అత్యున్నత స్థాయిలో నిలిపిన ప్రముఖులకు ప్రతి ఏటా ఈ లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డును ప్రధానం చేస్తున్నారు.

# తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్

**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో 7,437 పోస్టుల భర్తీకి సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ తేదీలను ప్రభుత్వం ఖరారు చేసింది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు.ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) బుధవారం నాలుగు వేర్వేరు నోటిఫికేషన్లను విడుదల చేసింది. పోలీస్ శాఖతో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్), అగ్నిమాపక, జైళ్ల శాఖల్లోని ఖాళీలను ఈ నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు.మొత్తం ఖాళీలలో అత్యధికంగా కానిస్టేబుల్, ఆ పైస్థాయి ఉద్యోగాలే ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. పోస్టుల వివరాలను పరిశీలిస్తే సివిల్ ఎస్సై-148, ఏఆర్ ఎస్సై-14, టీజీఎస్పీ ఏఆర్ ఎస్సై-12, ఎస్ఏఆర్ సీపీఎల్ ఎస్సై-03, ఫింగర్ ప్రింట్ బ్యూరో ఏఎస్సై-23, సివిల్ కానిస్టేబుల్-3,697, ఏఆర్ కానిస్టేబుల్-1,052, ఎస్ఏఆర్ సీపీఎల్ కానిస్టేబుల్-24, కానిస్టేబుల్ (డ్రైవర్) పీటీవో-20, కానిస్టేబుల్ (మెకానిక్) పీటీవో-07 చొప్పున ఖాళీలు ఉన్నాయి.

# భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు మణిహారం


**మొదటిపేజీ తరువాయి -** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారం లాంటిదని, ఈ ప్రాంత దశ, దిశను మార్చే శక్తి దీనికి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో 'అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం' ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. ఒకప్పుడు ఈ ప్రాంతానికి ఎర్రబస్సు కూడా రాదంటూ అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని, కానీ నేడు ఇక్కడకు ఎయిర్‌బస్ వచ్చిందని వ్యాఖ్యానించారు. అభివృద్ధికి అడ్డుపడిన శక్తులను ప్రజలు తిరస్కరించారని అన్నారు.ఈ విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులు ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని చంద్రబాబు ప్రశంసించారు. "రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో నేను, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చాం. ఆ హామీని నిలబెట్టుకున్నాం" అని ఆయన తెలిపారు. ఉత్తరాంధ్ర శక్తికి నిదర్శనంగా నిలిచే ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం గర్వకారణమని అన్నారు. ఉత్తరాంధ్ర



వాసి జీఎమ్మార్ ఈ ఎయిర్‌పోర్టును నిర్మించడం, దీనికి తొలి అడుగులు వేసిన అశోక్ గజపతిరాజు, ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా ఈ ప్రాంతం వారే కావడం విశేషమని గుర్తుచేశారు.ఈ సందర్భంగా రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టుల పూర్తిపై చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని, 2028 నాటికి రాజధాని అమరావతి తొలి దశ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రకటించారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను కాపాడింది, రైల్వే జోన్, పోలవరం, అమరావతికి నిధులు ఇచ్చింది ప్రధాని నరేంద్ర మోదీనే అని కొనియాడారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో తెలంగాణ దశ మారినట్లే, భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ధీమా వ్యక్తం చేశారు.రానున్న రెండేళ్లలో ప్రధాని సహకారంతో ఉత్తరాంధ్రలో రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులతో 189 ప్రాజెక్టులు తీసుకొస్తామని, తద్వారా 5.57 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రూ.2784 కోట్లతో 8 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామని, 65 ఏళ్లుగా పెండింగులో ఉన్న నేరడి బ్యారేజీకి సైతం అనుమతులు వచ్చాయని తెలిపారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మించి, టూరిజం, ఫార్మా రంగాలను అభివృద్ధి చేసి ఉత్తరాంధ్ర స్వరూపాన్ని మారుస్తామన్నారు. త్వరలోనే ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకు వలసలు వచ్చే రోజులు వస్తాయని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

# చంద్రుడిని ఢీకొట్టనున్న స్పేస్‌ఎక్స్ రాకెట్

**మొదటిపేజీ తరువాయి -** దూసుకెళ్తోంది. ఇది ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రయోగం కాదు. అయినా ఈ ఘటనపై ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ ఘటన వల్ల చంద్రుడిపై ఏర్పడే గుంత, ఎగిసే ధూళిని పరిశీలించి విలువైన సమాచారం సేకరించాలని భావిస్తున్నారు. 2025 జనవరి 15న రెండు ప్రైవేటు చంద్రయాన ల్యాండర్లను స్పేస్‌ఎక్స్ రాకెట్ తీసుకెళ్లింది. పని పూర్తయ్యాక దాని పైదశ అంతరిక్షంలోనే తేలియాడుతూ ఉంది. కక్ష్యను మార్చే అవకాశం లేకపోవడంతో అది ఇప్పుడు చంద్రుడివైపు దూసుకెళ్తోంది. బుధవారం చంద్రుడి పశ్చిమ అంచున ఉన్న ఐన్‌స్టీన్ క్రేటర్ సమీపంలో గంటకు సుమారు 8,700 కిలోమీటర్ల వేగంతో ఢీకొంటుందని అంతరిక్ష ట్రాకింగ్ నిపుణుడు బిల్ గ్రే అంచనా వేశారు. ఇది శబ్ద వేగం కంటే దాదాపు ఏడు రెట్లు ఎక్కువ.ఈ ఢీకొట్టడం వల్ల దాదాపు 27 మీటర్ల వెడల్పు, ఐదు మీటర్ల లోతుతో కొత్త గుంత ఏర్పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రభావం క్షణాల్లో ముగిసినా, ధూళి, రాళ్ల శకలాలు చాలా కిలోమీటర్ల ఎత్తుకు ఎగిరే అవకాశముంది. చంద్రుడిపై గాలి లేకపోవడం, గురుత్వాకర్షణ తక్కువగా ఉండడం వల్ల ఆ ధూళి కొంతసేపు అంతరిక్షంలోనే కనిపించొచ్చని వారు అంచనా వేస్తున్నారు. ఈ దృశ్యాలను భూమిపై ఉన్న టెలిస్కోపులతో పాటు కక్ష్యలోని వ్యోమనౌకలు కూడా చిత్రీకరించనున్నాయి.ఈ ఘటనతో శాస్త్రవేత్తలకు మరో కీలక అవకాశం లభించనుంది. భవిష్యత్తులో చంద్రుడిపై మానవ స్థావరాలు ఏర్పడినప్పుడు ఇలాంటి అంతరిక్ష వ్యర్థాలు ఎంతటి ప్రమాదం కలిగిస్తాయో అంచనా వేసేందుకు ఈ ఘటన ఉపయోగపడనుంది. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా లూనార్ రీకనైసెన్స్ ఆర్బిటర్‌తో పాటు దక్షిణ కొరియా దనూరి ఆర్బిటర్ కూడా ప్రమాదానికి ముందు, తర్వాత ఆ ప్రాంతాన్ని చిత్రీకరించనున్నాయి.ఇది చంద్రుడిని అనుకోకుండా ఢీకొట్టనున్న రెండో రాకెట్‌గా గుర్తింపు పొందుతోంది. 2022లో చైనా రాకెట్‌కు చెందిన ఓ భాగం చంద్రుడి అవతలి వైపు పడింది. ప్రస్తుతం అమెరికా, చైనా చంద్రుడిపై వ్యోమగాములను దింపే లక్ష్యంతో పోటీపడుతున్న వేళ అంతరిక్ష వ్యర్థాల పర్యవేక్షణ, ట్రాఫిక్ నియంత్రణపై మరింత దృష్టి పెట్టాల్సిన




అవసరం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

# పీవోకేలో పాక్ దమనకాండ

## నాలుగు రోజుల్లో 50 మందికిపైగా మృతి



**మొదటిపేజీ తరువాయి -** ఆరోపిస్తున్నాయి. ఈ ఘటనపై అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.'జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ' (జేఏఏసీ) సభ్యుడు సర్దార్ ఉమర్ నజీర్ కశ్మీరీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో స్పందిస్తూ, గత నాలుగు రోజుల్లో భద్రతా బలగాల చర్యల్లో 50 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. ముజఫరాబాద్ ప్రాంతంలో అర్ధరాత్రి వరకు నిరసనలు కొనసాగుతున్నాయన్నారు. ప్రజలు తమ మౌలిక హక్కుల పరిరక్షణతో పాటు స్థానిక అధికారులు ఇచ్చిన హామీల అమలును కోరుతున్నారని జేఏఏసీ వెల్లడించింది.అమెరికాకు చెందిన హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ (హెచ్‌ఆర్‌ఎఫ్) కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. నిరాయుధ, శాంతియుత నిరసనకారులపై పాకిస్థాన్ భద్రతా బలగాలు కాల్పులు జరిపినట్లు పేర్కొంది. స్థానిక పౌరసమాజ సంస్థల సమాచారం ప్రకారం.. ఆధారాలు దాచిపెట్టేందుకు ఆసుపత్రుల నుంచి మృతదేహాలను తొలగించడంతో పాటు ఉద్యమకారులను అదుపులోకి తీసుకున్నట్లు ఆరోపించింది. ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం, మీడియాపై ఆంక్షలు విధించడం వల్ల స్వతంత్ర సమాచారం బయటకు రావడం కష్టంగా మారిందని తెలిపింది.మరోవైపు యునైటెడ్ కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ (యూకేపీఎన్‌పీ) ప్రతినిధి బృందం ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో అధికారులను కలిసి పీవోకేలో జరుగుతున్న పరిణామాలను వివరించింది. శాంతియుత నిరసనకారులపై బలప్రయోగాన్ని వెంటనే నిలిపివేయాలని, మృతదేహాలను కుటుంబాలకు అప్పగించాలని, అదృశ్యమైన వారిపై వివరాలు వెల్లడించాలని పాకిస్థాన్‌ను అంతర్జాతీయ సమాజం ఒత్తిడి చేయాలని విజ్ఞప్తి చేసింది.

# భావ ప్రకటన స్వేచ్ఛకు ఎలాంటి భంగం సరికాదు



**మొదటిపేజీ తరువాయి -** అభిప్రాయాలు సేకరించాలని కూడా కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. ఈ చట్టం భవిష్యత్తులో దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా ఉండాలని, అదే సమయంలో రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛకు ఎలాంటి భంగం కలగకుండా సమతుల్యత పాటించాలని కమిటీ స్పష్టం చేసినట్లు వివరించారు.చట్టపరమైన వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యం : ఇది కేవలం శిక్షలు విధించే చట్టం కాదని, సమాజంలో విద్వేషపూరిత వాతావరణాన్ని నిరోధించి సామాజిక సామరస్యాన్ని కాపాడే దిశగా రూపొందిస్తున్న సమగ్ర బిల్లు అని పొన్నం ప్రభాకర్ తెలిపారు. సభలో కానీ, సమాజంలో కానీ విద్వేషపూరిత ప్రసంగాలు, ద్వేషాన్ని ప్రేరేపించే చర్యలకు తావు లేకుండా చట్టపరమైన వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు. నిర్మాణాత్మక సూచనలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు, నిపుణుల సలహాలను పరిగణనలోకి తీసుకుని తుది నివేదిక సిద్ధం చేస్తామని వెల్లడించారు.మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొని బిల్లులోని నిబంధనలు, ప్రజాస్వామ్య విలువలు, భావప్రకటన స్వేచ్ఛ, సామాజిక సామరస్యం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.

# వాట్సాప్ అంకుల్స్‌పై ఇన్‌స్టా పిల్లలు గెలిచారు

**మొదటిపేజీ తరువాయి -** పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' విజయం సాధించారని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మారుతున్న రాజకీయ సమీకరణాలు, యువతరం ప్రాధాన్యతపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు."యువతరం సరికొత్త రీతిలో ఢిల్లీలో కదం తొక్కింది. ఎవరితోనైతే ఘర్షణకు వెళ్లకూడదో, ప్రధాని మోదీ సరిగ్గా వారితోనే తలపడ్డారు. ఇటీవల జరిగిన పరిణామాల్లో 'వాట్సాప్ అంకుల్స్'తో సాగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' ఎలా పైచేయి సాధించారో దేశం మొత్తం చూసింది" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ సైతం అర్ధరాత్రి సమయంలో ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన గుర్తుచేశారు.ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా లేకపోతే పాలకుల్లో జవాబుదారీతనం ఉండేది కాదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. నేటి యువత వార్తాపత్రికలు చదవడం గానీ, టీవీ ఛానెళ్లు చూడటం గానీ తగ్గించారని, 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న వారు వార్తలను సైతం రీల్స్ రూపంలోనే వీక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.



# ప్రాణదాతగా మారిన హైదరాబాద్ మెట్రో

**25 నిమిషాల్లో అవయవాల తరలింపు**

**హైదరాబాద్ మెట్రోలో అవయవాల తరలింపునకు గ్రీన్ ఛానెల్**

**గచ్చిబౌలి నుంచి సికింద్రాబాద్‌కు గుండె, ఊపిరితిత్తుల రవాణా**

**14 కిలోమీటర్ల దూరాన్ని 25 నిమిషాల్లోనే పూర్తి చేసిన వైనం**

**ప్రాణాలను నిలబెట్టే చర్యలకు సహకారం కొనసాగిస్తామన్న అధికారులు**

హైదరాబాద్ మెట్రో రైలు అత్యవసర అవయవ మార్పిడి కోసం ప్రత్యేక 'గ్రీన్ ఛానెల్'ను ఏర్పాటు చేసి, ప్రాణాలను కాపాడే బృహత్కార్యంలో కీలక భాగస్వామిగా నిలిచింది. గచ్చిబౌలి నుంచి సికింద్రాబాద్‌కు సజీవ అవయవాలైన గుండె, ఊపిరితిత్తులను మెట్రో



ద్వారా అత్యంత వేగంగా తరలించారు.గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రి నుంచి సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి ఈ అవయవాలను తరలించాల్సి ఉండగా, రోడ్డు మార్గంలోని ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వైద్య బృందం మెట్రో అధికారుల సహకారం కోరింది. దీనిపై తక్షణమే స్పందించిన అధికారులు ప్రత్యేక గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశారు. ఫలితంగా దాదాపు 14 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 25 నిమిషాల్లోనే అధిగమించి, అవయవాలను సురక్షితంగా కిమ్స్ ఆసుపత్రికి చేర్చారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి అత్యవసర వైద్య సేవలకు, ప్రాణ రక్షణ చర్యలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మెట్రో రైలు అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. కీలక సమయంలో మెట్రో అధికారులు ప్రదర్శించిన సమయస్ఫూర్తి, చొరవపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# వీవీఐపీ గ్యాలరీలో భూములిచ్చిన రైతులు

**ప్రత్యేక అతిథులుగా గుర్తింపు**

**ప్రాజెక్ట్ కోసం స్వచ్ఛందంగా భూములిచ్చిన రైతులకు ప్రత్యేక గుర్తింపు**

**వీవీఐపీ గ్యాలరీలో ప్రత్యేక స్థానం కల్పించిన కూటమి ప్రభుత్వం**



నేడు ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చే విధంగా జీఎంఆర్ గ్రూప్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించిన గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభంకానుంది. అయితే ఇప్పటికే ఈ విమానాశ్రమం తొలి విజయాన్ని సంపాదించుకొని ప్రపంచానికి దాని ప్రత్యేకతను చాటి చెప్పుకుంది. దీనితో పాటు కూటమి ప్రభుత్వం ఇంతటి గొప్ప ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులకు ఈ కార్యక్రమంలో ప్రత్యేక స్థానాన్ని ఇచ్చింది. భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి భూములిచ్చిన రైతులను ప్రత్యేక అతిథులుగా ఆహ్వానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వారికి అరుదైన గుర్తింపును ఇచ్చింది. ప్రధానమంత్రి ఆశీనులయ్యే సభావేదికకు అతి సమీపంలోనే ఎదురుగా వీవీఐపీలకు ఏర్పాటు చేసిన గ్యాలరీలో రైతులకు ప్రత్యేక స్థానాన్ని కల్పించి ముందు వరుసలో కూర్చోబెడుతోంది. వీవీఐపీ గ్యాలరీలో భూములిచ్చిన రైతులు : భోగాపురం మండలంలోని గూడెపువలస, కంచేరు, కవులువాడ, ఎ.రావివలస, రావాడ, సవరవిల్లి, ముంజేరు గ్రామాలకు చెందిన రైతులు ఈ ప్రాజెక్ట్ కోసం స్వచ్ఛందంగా భూములిచ్చారు. 403 మంది రైతులతో పాటు ఇళ్లు ఇచ్చినవారు సుమారు 1,600 మంది వరకు ఉంటారు. రెండూ ఇచ్చినవారు దాదాపు 200 మందికి పైగా ఉంటారని అంచనా. వీరందరికీ భోగాపురం విమానాశ్రయం నుంచి ఒకసారి ఉచితంగా విమాన ప్రయాణ సౌకర్యం కల్పించాలని సీఎం చంద్రబాబు ప్రకటించారు. సీఎం ప్రకటించిన విధంగానే ముందుగా రైతులను విమానంలో హైదరాబాద్ తీసుకెళ్తారు. అక్కడ శంషాబాద్‌లో విమానాశ్రయం నిర్మించక ముందున్న పరిస్థితితో పాటు తర్వాత చుట్టుపక్కల అభివృద్ధిని క్షేత్రస్థాయిలో రైతులకు చూపించి, దాని గురించి వారికి వివరిస్తారు. గిరిజన నృత్యానికి గిన్నిస్ రికార్డ్ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'థింసా' నృత్య ప్రదర్శనకు ప్రపంచవ్యాప్త గుర్తింపు దక్కింది. గిన్నిస్‌బుక్ఆఫ్‌వరల్డ్‌రికార్డు సృష్టించింది. ఒకేవేదికపై దాదాపు 13 వేల మంది గిరిజన విద్యార్థినులు, మహిళలు ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని సుమారు ఎనిమిదెకరాల్లో థింసా నృత్యం రిహార్సల్స్?తో శుక్రవారం అందరినీ అలరించారు. ఏర్పాటు చేసిన 260 బాక్సుల్లో 50 మంది చొప్పున గిరి విద్యార్థినులు, మహిళలు ప్రదర్శనలిచ్చారు. పాడేరు, పార్వతీపురం, రంపచోడవరం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ పాఠశాలల విద్యార్థినులు, మహిళలు భోగాపురంలో సామూహికంగా థింసా నృత్యాన్ని అభ్యాసం చేశారు. ప్రత్యేకంగా గులాబీ రంగు చీరలు, ఆకుపచ్చ రంగు జాకెట్లు ధరించి ఒడియా గీతానికి 13,000 మంది ఒక్కసారిగా పాదం కదిపారు. దాదాపు 64 మంది శిక్షకులు వీరికి 15 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. మరో 1,000 మంది వారికి సహాయకులుగా పనిచేశారు. గిన్నిస్ రికార్డ్స్ ప్రతినిధులు లండన్ నుంచి వచ్చి ఈ నృత్యాన్ని వీక్షించి రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి ఎంతో ప్రత్యేకమైన గిన్నిస్‌బుక్ఆఫ్‌వరల్డ్‌రికార్డు ధ్రువపత్రాన్ని అందించారు. దీంతో ఒక్కసారిగా గిరిజన సంస్కృతి, సంప్రదాయం, వైభవం దేశంతోపాటు ప్రపంచ దేశాలకు తెలిసింది. ప్రారంభోత్సవానికి ముందే భోగాపురం తొలి విజయంతో పాటు ఇంతటి ఘన విజయాన్ని సాధించిందని మంత్రి సంధ్యారాణి పేర్కొన్నారు. మంత్రులు సంధ్యారాణి, వంగలపూడి అనిత, సవిత, జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై వేటు

**అవినీతి, అక్రమాల కారణంగా పదవీవిరమణ రోజునే సస్పెండ్**

**వీసీ ప్రసాదరెడ్డితో పాటు మరో నలుగుర్ని సస్పెండ్ చేస్తూ ఈసీ తీర్మానం**

**చర్యల నివేదికను గవర్నర్‌కు పంపనున్న వర్సిటీ**

**రిజిస్ట్రార్‌కు క్రిమినల్ చర్యలు తీసుకునే బాధ్యత**



వైఎస్సార్సీపీ సేవలో తరించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ పీవీజీడీ ప్రసాదరెడ్డిపై వేటు పడింది. వైఎస్సార్సీపీ నేతల అండతో పదవిలో ఉన్నప్పుడు చేసిన అవినీతి, అక్రమాల కారణంగా పదవీవిరమణ రోజునే సస్పెండయ్యారు. విశ్వవిద్యాలయంలో అనేక అరాచకాలకు, అధికార దుర్వినియోగానికి పాల్పడిన ప్రసాదరెడ్డి ప్రతిష్ఠాత్మకమైన ఆంధ్ర వర్సిటీ పేరునూ మంటగలిపారు. ఆయన పై వచ్చిన ఫిర్యాదులపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ విచారణకు ఆదేశించింది. దీంతో ఆయన చేసిన అక్రమాలు బహిర్గతమయ్యాయి. విజిలెన్స్ నివేదిక, సిఫార్సుల ఆధారంగా ప్రసాదరెడ్డితో పాటు మరో నలుగుర్ని సస్పెండ్ చేస్తూ పాలక వర్గం తీర్మానించింది. విశ్వవిద్యాలయం, ప్రభుత్వ నిబంధనల ప్రకారం తదుపరి క్రమశిక్షణ చర్యలను పెండింగ్ లో పెడుతూ వెంటనే సస్పెన్షన్ అమల్లోకి వచ్చేలా ఈసీ నిర్ణయం తీసుకుంది. ఐదుగురి సస్పెన్షన్లకు విడివిడిగా ప్రొసీడింగ్స్ జారీ చేసింది. ఆది నుంచీ ఆరోపణలు: వైఎస్సార్సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లూ ప్రసాదరెడ్డి ఓ అరాచకశక్తిలా వ్యవహరించారు. అతని అక్రమాలు, అధికారం దుర్వినియోగంపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టించారు. అప్పట్లో వీసీ హోదా రాగానే ఐదుగురు సిబ్బంది పెట్టుకుని కారు డోర్ తీయడం, సెల్యూట్ చేయడం వంటివి చేయించుకున్నారు. వర్సిటీలో జగన్ పుట్టినరోజు వేడుకలు, వైఎస్సార్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. గవర్నర్ కు నివేదిక: ప్రసాదరెడ్డి వీసీగా ఉన్నప్పుడు అక్రమాలకు పాల్పడినట్లు విజిలెన్స్ నివేదిక సమర్పించారు. దీంతో ఆయనపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం గవర్నర్ కార్యాలయానికి దస్త్రాన్ని పంపింది. ప్రస్తుతం ప్రొఫెసర్ హోదాలో ఉన్నందున పాలక వర్గంలో నిర్ణయం తీసుకుని, చర్యల నివేదికను సమర్పించాలని గవర్నర్ కార్యాలయం సూచించింది. దీంతో ఈసీలో నిర్ణయం తీసుకున్నారు. చర్యల నివేదికను వర్సిటీ ద్వారా గవర్నర్?కు సమర్పించనున్నారు. క్రిమినల్ చర్యల ప్రక్రియను రిజిస్ట్రార్ చేపడతారు. క్రమశిక్షణ చర్యలను ఉన్నత విద్యాశాఖ చేపడుతుంది. వాట్సప్, ఈ-మెయిళ్ల ద్వారా ఉత్తర్వులు: ప్రసాదరెడ్డి శుక్రవారం పదవీ విరమణ చేయాల్సి ఉంది. అందుకు కొన్ని గంటల ముందు ఆయన్ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఆయన ఎక్కువ రోజులు సెలవుల్లోనే ఉన్నారు. 3 రోజులుగానే డిపార్టుమెంట్‌కు వస్తున్నారు. చివరి రోజు శుక్రవారం ఉదయం వచ్చారు. ఈ సస్పెన్షన్ ఉత్తర్వులను వేర్వేరుగా అందజేశారు. సీనియర్ అసిస్టెంట్‌కు భౌతికంగా అందజేయగా, మిగిలిన వారు అందుబాటులో లేకపోవడంతో సంబంధిత విభాగాల్లో వాటిని అందజేశారు. రిజిస్ట్రార్ వాట్సప్ నంబరు నుంచి వ్యక్తిగతంగా పంపించడంతో పాటు విశ్వవిద్యాలయం ఈ-మెయిల్ నుంచి వారి వ్యక్తిగత ఈ-మెయిల్స్‌కు పంపించారు. మరో నలుగురు సస్పెండ్: ఏయూ మాజీ వైస్‌ఛాన్సలర్, కంప్యూటర్ సైన్స్, సిస్టమ్స్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి, రసాయనశాస్త్రం విభాగం ప్రొఫెసర్, మాజీ డీన్ కె.బసవయ్య, కంప్యూటర్ సైన్స్, సిస్టమ్స్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ కుంజం నాగేశ్వరరావు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కె.కృష్ణ అప్పారావు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అధ్యయన కేంద్రం ప్రొఫెసర్ మేకా జేమ్స్ స్టీఫెన్‌ను సస్పెండ్ చేస్తూ పాలకవర్గం (ఈసీ) నిర్ణయం తీసుకుంది. క్రమశిక్షణ చర్యలు పూర్తయ్యేవరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని పేర్కొంది.

# ఎగువ నుంచి వస్తోన్న వరదతో ప్రాజెక్టులకు జలకళ

**గోదావరి, కృష్ణమ్మల బిరబిరా**

**గోదావరి, కృష్ణా నదుల్లో వరద ఉద్ధృతి**

**రిజర్వాయర్లలో పెరుగుతున్న నీటి నిల్వలు**

**ఎస్సారెస్పీ, ఎల్లంపల్లికి భారీగా నీటి ప్రవాహం**

**భద్రాచలం వద్ద కొనసాగుతోన్న మూడో ప్రమాద హెచ్చరిక**



రాష్ట్రానికి జీవనాడులైన కృష్ణా, గోదావరి నదుల్లో వరద ఉద్ధృతి కొనసాగుతోంది. ఆయా నదులపై రిజర్వాయర్లలోకి ప్రవాహాలు మెరుగ్గా ఉండటంతో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. ప్రధానంగా గోదావరి నుంచి వస్తున్న ప్రవాహంతో ఎస్సారెస్పీ, ఎల్లంపల్లికి భారీగా వరద పోటెత్తింది. భద్రాచలం వద్ద 15.40 లక్షల క్యూసెక్కుల వరద నమోదవడం, నీటి మట్టం 55 మీటర్లు దాటడంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అటు కృష్ణా పరివాహకంలోనూ జూరాలకు వరద పోటు కొనసాగుతోంది. అక్కడి నుంచి శ్రీశైలం దిశగా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది.ఉత్తర తెలంగాణలో వర్షాలు తగ్గుముఖం పట్టినా ఎగువ నుంచి వస్తున్న వరదతో గోదావరి పరివాహకంలోని ప్రాజెక్టులకు ప్రవాహం కొనసాగుతోంది. శ్రీరాంసాగర్ జలాశయంలోకి ప్రస్తుతం 60 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 23 టీఎంసీల నీరుంది. ప్రవాహం ఇలాగే కొనసాగితే శ్రీరాంసాగర్ పది రోజుల్లో పూర్తిగా నిండుతుంది. ఎగువ నుంచి వస్తోన్న వరదతో ప్రాజెక్టులకు జలకళ - గోదావరి, కృష్ణమ్మల బిరబిరా ఎస్సారెస్పీ దిగువన ఉన్న కడెం ప్రాజెక్టులోకి వస్తున్న వరద 11 వేల 700 క్యూసెక్కులకు తగ్గింది. ఎల్లంపల్లికి 88,705 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, 96 వేల క్యూసెక్కులను కిందకి విడిచి పెడుతున్నారు. ఎల్లంపల్లి నుంచి మధ్య మానేరుకు గాయత్రి పంప్‌హౌస్ ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. అటు నిజాంసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 17.9 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.84 టీఎంసీలకు చేరుకుంది. భద్రాచలంలో 55 అడుగులకు చేరిన నీటిమట్టం ప్రాణహిత నుంచి వస్తున్న భారీ వరదతో మేడిగడ్డ వద్ద 10.62 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా, అధికారులు మొత్తం నీటిని దిగువకు వదులుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం అమాంతం పెరిగిపోయింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు 43 అడుగుల వద్దకు చేరుకోగా అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు 48 అడుగులకు చేరుకోవడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. శనివారం ఉదయానికి 55 అడుగులకు చేరుకోవడంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. భద్రాచలం వద్ద గోదావరికి వరద పెరుగుతున్నందున పరీవాహక ప్రాంతాల ప్రజల భద్రత కోసం ముందు జాగ్రత్తలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్‌రాజ్ గోదావరి పరివాహకంలో క్షేత్రస్థాయిలో పర్యటించి లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. శ్రీశైలం దిశగా పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ కృష్ణానది ఎగువన ఆల్మట్టిలోకి 83 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, లక్షా 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచి పెడుతున్నారు. నారాయణపూర్ నుంచి 1.05 లక్షల క్యూసెక్కులు వదలడంతో పాటు దిగువన వర్షాలతో జూరాలలోకి 1.22 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. అక్కడి నుంచి 1.36 లక్షల క్యూసెక్కుల నీటిని నదిలోకి వదలగా, శ్రీశైలంలోకి 1.31 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోంది. శ్రీశైలం కనీస నీటిమట్టానికి చేరినా, పూర్తిగా నిండాలంటే మరో 160 టీఎంసీలు అవసరం. దిగువన నాగార్జున సాగర్‌కు మరో 80 టీఎంసీలు కావాలి. సుమారు 240 టీఎంసీలు వస్తేనే శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందించడం వీలవుతుంది.

# 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమానికి విశేష స్పందన

**శ్రేణులను అభినందించిన లోకేశ్**

**'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమం ఐదో రోజూ విజయవంతం**

**5 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల ఇళ్లను సందర్శించిన కూటమి నేతలు**

**రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరణ**

**కార్యకర్తలను వ్యక్తిగతంగా అభినందిస్తూ ప్రోత్సహిస్తున్న మంత్రి నారా లోకేశ్**




ఆంధ్రప్రదేశ్‌లో అధికార తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికీ టీడీపీ 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోంది. ఐదో రోజుకు చేరుకున్న ఈ కార్యక్రమం ద్వారా కూటమి నాయకులు, కార్యకర్తలు గడిచిన ఐదు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల కుటుంబాలను నేరుగా కలిశారు. రెండేళ్ల పాలనలో ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ కార్యక్రమం కింద శుక్రవారం ఒక్కరోజే కూటమి శ్రేణులు సుమారు 2.80 లక్షల ఇళ్లను సందర్శించాయి. ఇంటింటికీ వెళ్తున్న నేతలు, కార్యకర్తలు ముఖ్యంగా రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, మౌలిక సదుపాయాల కల్పన వంటి కీలక అంశాలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రజలకు వివరిస్తున్నారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా పంచుకుంటున్నారని టీడీపీ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో పాటు జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారు.శ్రేణులను ప్రోత్సహిస్తున్న మంత్రి నారా లోకేశ్ "ఇంటింటికీ టీడీపీ" కార్యక్రమం పురోగతిని మంత్రి, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. క్షేత్రస్థాయిలో చురుగ్గా పాల్గొంటూ ఉత్తమ పనితీరు కనబరుస్తున్న నాయకులు, కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. కొందరికి వ్యక్తిగతంగా ఎస్ఎంఎస్‌లు పంపుతూ, మరికొందరితో నేరుగా ఫోన్‌లో మాట్లాడి వారిలో ఉత్సాహాన్ని నింపుతున్నారు. పార్టీ శ్రేణులు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, రానున్న రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ చేరుకుని ప్రభుత్వ విజయాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా వివరించాలని లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర కీలకమని ఆయన ప్రశంసించారు.

# గోదావరి ఉగ్రరూపం భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ

**ఉద్ధృతంగా ప్రవహిస్తున్న గోదావరి**

**భద్రాచలంలో 55 అడుగులకు చేరిన నీటి మట్టం**

**మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన అధికారులు**

**వరద ప్రభావంతో పలు ప్రాంతాలకు నిలిచిపోయిన రాకపోకలు**

**భద్రాచలంలో మూడో ప్రమాద హెచ్చరిక**



భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపు దాల్చింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో ప్రవాహం పోటెత్తుతోంది. గోదావరి నీటి మట్టం 55 అడుగులకు చేరింది. దీంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరిలో 15.40 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. పోటెత్తుతున్న వరదతో స్నాన ఘట్టాలు, కల్యాణ కట్ట, విద్యుత్ స్తంభాలు మునిగిపోయాయి. వరద ఉద్ధృతితో పలు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చర్లలోని తూరుబాక వద్ద రోడ్డుపైకి నీరు చేరింది. వరద నీటితో చింతూరు, కూనవరం, వీఆర్‌పురం మండలాలకు రాకపోకలు స్తంభించాయి. శుక్రవారం ఉదయం 10 గంటలకు గోదావరి నీటిమట్టం 43 అడుగుల వద్దకు చేరుకోగా అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు 48 అడుగులకు చేరుకోవడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 55 అడుగులకు చేరిన ప్రవాహం ఎగువన ఉన్న కాళేశ్వరం నుంచి భారీగా వరద పోటెత్తడంతో భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. గురువారం నాటికి 30 అడుగుల వద్ద ఉన్న నీటి మట్టం, శుక్రవారం అర్ధరాత్రికి 53 అడుగులకు పెరిగింది. శనివారం ఉదయానికి కల్లా ప్రవాహం 55.1 అడుగులకు చేరింది. జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పొంగి పొర్లుతున్న వాగులను దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరిస్తూ, భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. భద్రాచలంలో మూడో ప్రమాద హెచ్చరిక జారీ కోతకు గురవుతున్న రోడ్లు గోదావరి నీటి మట్టం పెరుగుతుండటంతో శుక్రవారం సాయంత్రం నుంచే దుమ్ముగూడెం, భద్రాచలం మధ్య రాకపోకలను నిలిపివేశారు. దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల వద్ద స్నాన ఘట్టాలు నీట మునిగాయి. సీతవాగు దగ్గర సీతమ్మ నార చీరలు, స్వామివారి సింహాసనంతో పాటు ఐరన్ ఫుట్ బ్రిడ్జి కూడా నీట మునిగింది. తురుబాక ఆర్ అండ్ బి ప్రధాన రహదారిపై కొత్తగా నిర్మించిన హైలెవల్ బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న అప్రోచ్ రోడ్లు కోతకు గురై ప్రమాదకర పరిస్థితి ఏర్పడింది. తృటిలో తప్పిన ప్రమాదం ఎగువ నుంచి ఒక్కసారిగా వచ్చిన వరదతో చర్ల మండలంలోని వీరాపురం శివార్లలో ఉన్న ఇసుక క్వారీ వద్ద, నీటిలో చిక్కుకుపోయిన సుమారు 44 మందిని అధికారులు సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఇందులో లారీ డ్రైవర్లతో పాటు స్థానికులు కూడా ఉన్నారు. ఆ క్వారీ వద్ద ఇంకా 30కి పైగా లారీలు ఉండిపోయాయి. అక్కడ చిక్కుకున్న వారిని రక్షించడానికి తెప్పపై వెళ్లే క్రమంలో సిఐ రాజువర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి వరద నీటిలో పడిపోయారు. తిరిగి ఈదుకుంటూ వారు తెప్పపైకి చేరడంతో ప్రమాదం తప్పింది. 'ప్రజాప్రతినిధులూ భద్రతా చర్యల్లో పాల్గొనాలి' గోదావరికి వరద ఉద్ధృతి పెరుగుతుండటంతో, నదీ పరివాహక ప్రాంతాల ప్రజల భద్రత కోసం ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్‌తో ఫోన్‌లో మాట్లాడి లోతట్టు ప్రాంతాలు, గోదావరి పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. భద్రతా చర్యలలో ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని చెప్పారు. మంత్రుల క్షేత్రస్థాయి పర్యటన పునరావాస కేంద్రాలలో తాగునీరు, వైద్య సేవలు, ఆహారం, పారిశుద్ధ్యం, విద్యుత్ వంటి కనీస సౌకర్యాలన్నీ అందుబాటులో ఉండేలా చూడాలని మంత్రి పొంగిలేటి ఆదేశించారు. అధికారిక సూచనలను పాటించాలని, వదంతులను నమ్మొద్దని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఇవాళ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు మూడు జిల్లాల్లోని ప్రాజెక్టులను పరిశీలించనున్నారు. తొలుత నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టును సందర్శించి నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు వద్ద పర్యటించనున్నారు. ఆ తర్వాత పెద్దపల్లి జిల్లాలోని పార్వతి పంప్ హౌస్ కు చేరుకోనున్నారు.

# హోటళ్లు, రెస్టారెంట్లకు ఊరట

**భారీగా తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర**

**వాణిజ్య ఎల్పీజీ ధరపై రూ.200కుపైగా కోత**

**ఆగస్టు 1 నుంచే కొత్త ధరల అమలు**

**ఢిల్లీలో రూ.202.. కోల్‌కతాలో రూ.209 తగ్గింపు**

**హైదరాబాద్‌లో రూ.206 తగ్గి రూ.2,985కు చేరిన ధర**

**గృహ వినియోగ ఎల్పీజీ ధరల్లో మార్పు లేదు**

**వరుసగా రెండో నెలా ధరల తగ్గింపు**



హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ సంస్థలకు కేంద్రం ఊరటనిచ్చింది. 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరను ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీలు) రూ.200కుపైగా తగ్గించాయి. తాజా ధరలు నేటి అమల్లోకి వచ్చాయి. అయితే గృహ వినియోగదారులు ఉపయోగించే 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు. తాజా సవరణ ప్రకారం ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్‌పై రూ.202, కోల్‌కతాలో రూ.209 వరకు తగ్గింది. దీంతో కోల్‌కతాలో ఒక్కో వాణిజ్య సిలిండర్ ధర రూ.2,872.50కు చేరింది. హైదరాబాద్‌లో రూ.206 తగ్గి రూ.2,985గా ఉంది. ఇతర ప్రధాన నగరాల్లో కూడా దాదాపు ఇదే పరిధిలో ధరలు తగ్గించినట్లు ఓఎంసీలు వెల్లడించాయి. ఈ నిర్ణయంతో హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న వ్యాపార సంస్థలపై ఇంధన భారం కొంత తగ్గనుంది. ఇటీవల పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయ ఇంధన ధరలు పెరగడంతో వాణిజ్య ఎల్పీజీ ధరలు పలుసార్లు పెరిగాయి. ఇప్పుడు ప్రపంచ ఇంధన మార్కెట్లు క్రమంగా స్థిరపడుతుండటంతో ఓఎంసీలు ధరలను తగ్గించాయి. అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా ఎల్పీజీ ధరలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయి. గత నెల జులై 1న కూడా 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.183.50 వరకు తగ్గించారు. వరుసగా రెండో నెలా ధరలు తగ్గడంతో వ్యాపార వర్గాలు ఊరట వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు లేకపోవడం గృహ వినియోగదారులకు నిరాశ కలిగిస్తోంది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com